


అసలు సుబ్బారావంటే నాకు మొదట్నుంచి పడదు. దానికి కారణం లేకపోలేదు నా కథల గురించి ఎక్కడో అవాకులూ చవాకులూ ప్రేలాడట ఆ మనిషిలో తానేదో పెద్ద విమర్శకుడనన్న గర్వం బాగా కన్పిస్తుంది. ఆ రోజు అతనితో అంత అకస్మాత్తుగా మాట్లాడవలసి వస్తుందని అనుకోలేదు. మా ఇంటి అరుగుమీద కూర్చుని ఆ వారం పత్రికలో పడ్డ నా కథ చదువుకొంటున్నాను.

"నమస్కారం మాస్టారూ" అని వినిపిస్తే తలెత్తి చూసాను.

"రావోయి కూచో" అన్నాను ఆశ్చర్యపోతూ

సుబ్బారావు కూచున్నాడు. "మీ కభ్యం తరం లేకపోతే మీతో కాసేపు కాలక్షేపం చేద్దామని ఉంది" అన్నాడు.

వాడు ఇప్పుడు తగిలాడేమిటని చిరాకుపడ్డాను. "అభ్యంతరం ఏముంది, అలాగే కాని" అన్నాను చేతిలో పత్రిక ప్రక్కన పెడుతూ.

"మీరేదో కథ చదువు తున్నట్టుందే. డిస్టర్బెన్సు కలిగించినట్టున్నాను. సారీ" అన్నాడు పత్రిక వంకచూస్తూ.

'ఫరవాలేదులేవోయ్! నా కథే చదువు కొంటున్నాను,' సగర్వంగా చెప్పాను

"నేను ఒకసారి చదవచ్చా" అడిగాడు.

"తప్పకుండా." పత్రిక అందిచ్చాను

ఆ కథేమిటో సంక్షిప్తంగా పాఠకులు కూడా తెలుసుకోవాలి.

"ఒక పేద గుమాస్తా. చిన్నప్పుడు నీతిపాఠాలు, శతకాలు చదువుకున్నవాడు. లంచాలు పుచ్చుకోడం తప్పని అతనికి ఎప్పుడో తెలిసింది. దేవుడు తనలాటి నీతిపరుల మీద మంచి చూపు చూస్తాడని నమ్మినవాడు. అందుకే రెండో పూట పస్తులుంటున్నా చేతులు మేజాల క్రిందికి చాచలేదు. పిల్లల్ని బళ్ళోకి పంపించేం దుకు పుస్తకాలు కొనాల్సివున్నా అపమార్గాల్ని పట్టలేదు. ఈసారి పండుక్కయినా కొత్త చీరకొని పెట్టమని పెళ్ళాం మారాం చేసినా డబ్బుకి అమ్ముడుపోలేదు. అంత మంచి వాడు ఆ గుమాస్తా.

మనుషులు కష్టాలు పడుతున్నారంటే దేవుడు వారిని పరీక్షిస్తున్నా డన్నమాట. ఆ కష్టాలను తిట్టుకోకుండా తలవంచుకొని పోయేవాడికి తప్పకుండా మేలు జరుగు తుంది.


ఆ గుమాస్తాకు మేలే జరిగింది. కొద్ది కాలానికి అతడి నిజాయితీని,వినయ విధేయ తలను పై ఆఫీసర్లు గుర్తించారు. వెంటనే మంచి ప్రమోషను లభించింది.

కథ చదివిన సుబ్బారావు ఊరుకొన్నాడా. "ఇదో వెధవ కథ మాష్టారూ" అని వెధవ అభిప్రాయం వెల్లడించాడు.

ఆ వెధవ మీద నాకు చిరాకెత్తు కొచ్చింది. "అవును. మనుషులు నీతికి, నిజాయితీకి కట్టుబడి ఉండటం నీ కిష్టం లేదు. ఆ గుమాస్తాని లంచం తీసుకొన్న ట్టుగా చూపిస్తే ఇది నీకు మంచి కథే అయుండేది" అన్నాను

"ఈ కథ వల్ల ఏమిటి సాధిద్దామను కున్నారు?" ప్రశ్న వేసాడు.

చెప్పాను "సమాజం చెడిపోతున్నాది. డబ్బు కాశపడి మనుషులు పెడదార్లు త్రొక్కుతున్నారు. నీతిని వదిలేస్తున్నారు. ఈ సమాజాన్ని బాగుచెయ్యవలసిన పాత్ర రచయిత మీదే వుంది. అందు గురించి నీతికోసం నిలబడే పాత్రలే కథల్లో సృష్టించబడాలి. చివరికి అందువల్ల మంచి ప్రయోజనం చేకూరేట్టు చూపించాలి. అప్పుడే ఆ కథలు నీతిని పాటించేందుకు తగిన ఆత్మ స్థైర్యాన్ని ప్రజల్లో కలి గిస్తాయి."




కాని సుబ్బారావు ఊరుకొంటాడా. అసలే పెద్ద విమర్శకుడ ననుకుంటాడు. "మీరు మీ కథల్లో కథానాయకుడ్ని నీతి అనే ఆదర్శంకోసం చివరిదాకా నిలబెడతారు. పరిస్థితులు ఎంత క్రుంగదీసినా ఆదర్శంవలన ప్రయోజనం చేకూరేటట్టు చూపిస్తారు కాని అందులో మీరు వాడి వ్యక్తిగత జీవితాన్ని దాచేస్తున్నారు. అబద్ధానికి రంగులు పూసి నిజంలా మభ్యపెడుతున్నారు. నిజానికి లంచం పుచ్చుకొని కంట్రాక్టరు కనుకూలంగా పనిచేయని గుమాస్తా మర్నాడే ఏ దూర ప్రాంతానికో బదిలీ అవుతున్నాడు. వాడికి ఏ లాటరీయో లేక ప్రమోషనో వచ్చినట్టు కథల్లో చూపించడం సులభమే. కాని జీవితంలో వాడు నీతిని విడిచిపెట్టి డబ్బుకోసం ఎంత పనయినా చేస్తున్నాడనా? ఇటువంటి రచనల ద్వారా ఆకలి కడుపుకి అన్నం లేనివారికి నీతి అంటూ ఏదో బోధించి వారిలోవుండే చైతన్యాన్ని చంపేస్తున్నారు" అన్నాడు.

నాకు కోపం వచ్చేసింది. సుబ్బారావుని అమాంతంపట్టి బాల్ బంతిలా తన్నేద్దామా అనిపించింది. "సమాజం ఇప్పటికే చెడిపోయింది ఒక వ్యక్తి నీతిని విడిచిపెట్టి సుఖపడ్డట్టు చూపిస్తే అది ఇంకా చెడు ప్రభావం తెస్తుంది" అన్నాను.

సుబ్బారావు వెంటనే అందుకున్నాడు. "మీరు చెప్పినట్టు సమాజం చెడిపోతున్నాదన్న విషయం నిజమే. గుమాస్తాలు లంచాలు తింటున్నారు. అడుక్కునేవాళ్ళు తమ పిల్లలకు కాళ్ళు విరిచేసో, కళ్ళు పోగొట్టో మళ్ళీ అడుక్కునేందుకు దేశం మీదకు పంపిస్తున్నారు. ఆడవాళ్ళు వ్యభిచరిస్తున్నారు. అంతకంటే హేయమైన బ్రతుకుందా. లేదు. కాని దానంతటికీ మూల కారణం ఏమిటి? అది ముఖ్యంగా ఈ వ్యవస్థ

దోషం.ఇందులో వారి బాధ్యత కొంతవరకే. వారు అలా తయారవడానికి కారణమైన చుట్టూ ఉన్న పరిస్థితులను నిర్మూలించాలి గాని వారికి నీతిబోధలు చేసి ప్రయోజనం లేదు," ఆవేశంతో చెప్పుకుపోయాడు.

కాసేపూరకుండి తనే అన్నాడు."మీరు పొరబడ్డారు మాష్టారూ. మీ కథల్లో నీతి, నిజాయితీ అంటూ గంతులేసినంత మాత్రాన ప్రయోజనం ఉండదు. మని షెప్పుడూ పరిస్థితులకు బానిస. ఆదర్శం నిలబెట్టుకోడం గొప్ప విషయమే కాని నిల బెట్టుకుందామనుకునే వాడు చితికి పోతు న్నాడు. తను బ్రతకడానికి తిండి, బట్ట, ఇల్లు మొదలైన కనీసావసరాలు లేనపుడు ఎవడూ నీతిని గురించి ఆలోచించడు.

మీరు గదిలో నాలుగు గోడల మధ్యన కూచుని మీ వూహా ప్రపంచంలో యేవో పాత్రలు సృష్టించి కథలు వ్రాస్తారు. అబ ద్ధాన్ని 'నిజం'గా చాటుతారు. మీరు జీవి తానికి దగ్గరగా రావాలి. జీవితాన్ని పరిశీలిం చాలి. జీవితాన్ని అనుభవించాలి. జీవితం మధ్యనే జీవించాలి. మీరు తీసుకున్న కథావస్తువు జీవితం నుండే తీసుకోవాలి. జీవితంనుండి తీసుకున్న కథావస్తువుతోనే జీవితాన్ని ప్రభావితం చెయ్యాలి. అప్పుడే కథకు ప్రాణం ఏర్పడుతుంది. కొత్త వ్యవస్థకు పునాది ఏర్పడుతుంది."

సుబ్బారావు చెప్పడం అయిపోయిం దన్నట్టుగా నా వంక చూశాడు. నాకు అతడిమీద విపరీతమైన కోపం వచ్చింది. నేను జీవితానికి దగ్గరగా రావాలా? ఊహా ప్రపంచంలో ఉండి కథలు రాస్తున్నానా? "తనలో పట్టుదల ఉంటే ఎంతటి వ్యక్తైనా నీతి నిజాయితీలకోసం నిలబడగలడు. ఇది వాస్తవికతకు విరుద్ధం కాదు. అలా నిల బడలేనివాడ్ని నేను సహించను. పైగా క్షమించను కూడ" అన్నాను.

అతడు ఒక్కక్షణం గంభీరంగా నాకేసి చూసి చెప్పాడు: "మీరు మీ కథల ద్వారా వారిని మార్చేయలేరు మాష్టారూ. ఈ వ్యవస్థలో నీతి నిజాయితీలు నిలబడవని వారికి జీవితమే నేర్పుతుంది. సరే, ఈ గొడవలు ఇప్పుడెందుకు గాని చిన్న సంఘ టన గుర్తొచ్చింది. చెప్తాను వినండి" అంటూ చెప్పాడు.

"మా వూళ్ళో ఒక మాష్టరుగా రున్నారు. ఆయనకు ఆరుగురు సంతానం. భార్య రోగిష్టిది. డాక్టరు వ్రాసిన మందులు కొనాలంటే ఆయన దగ్గిర డబ్బు లేదు. మందులు తనుకొంటేగాని ఆమె బ్రతకదు. ఆ వూర్లో ఆయనకు కానీ కూడ అప్పు పుట్టదు.

ఇటువంటి పరిస్థితిలో ఆయన పిల్లల పేపర్లు దిద్దారు. మా వూళ్ళో రామనాథం అని ఒక ధనవంతుడున్నాడు. ఆయన గారికో అబ్బాయి ఉన్నాడు. అతడి పేపరు మాష్టారి చేతిలోకే వెళ్ళింది. పాసుకావ టానికి అయిదు మార్కులు తక్కువ వచ్చా యని రామనాథం ముందే తెలుసుకొని మాష్టారితో చెప్పాడు.

"ఏమిటి?" అడిగాను.



"అతడి కుర్రాడిని పాసుచేస్తే వంద రూపాయలు బహుమానం ఇస్తానన్నాడు. ఒక ప్రక్క పెళ్లాం జబ్బు ముదిరిపోతున్నాది. దిద్దిన పేపర్లు మర్నాటికి హెడ్మాష్టరు గారికిచ్చేయాలి. పెళ్లాన్నెలాగైనా బ్రతికించుకోవాలంటే మందులు కొనాలి. డబ్బు ఇంకెక్కడి నుండైనా వచ్చేమార్గం కనబడ్డంలేదు. ఇటువంటి పరిస్థితిలో ఏం చేస్తాడు చెప్పండి" అని సూటిగా నాకే ప్రశ్న వేశాడు.

"పాపం ఏం చేస్తాడు! రామనాధం దగ్గిర నూరు రూపాయలు పుచ్చుకొని వాళ్ళబ్బాయిని పాసుచేసి ఉంటా"డన్నాను.

"మీరు చెప్పింది కరక్టు. వస్తా"నంటూ లేచి వెళ్ళబోయాడు.

ఇంతలో నాకో సందేహం వచ్చింది. "ఇంతకీ మాష్టారి పెళ్ళాం బ్రతికిందా?" అడిగాను.

సుబ్బారావు ఒకసారి సన్నగా నవ్వాడు. "ఇప్పుడు నే చెప్పిన సంఘటన యేదీ జరగలేదు. మాష్టారు లేరు. రామనాధం లేడు. మాష్టారి పెళ్ళాం, ఆవిడకో జబ్బూ, ఏదీ లేదు," అని వడివడిగా వెళ్ళిపోయాడు.